క్లుప్తంగా

బోరు పనుల పరిశీలన



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధి తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టపై బోరు పనులను కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉండటంతో దాదాపు రూ.3.50 లక్షలతో నూతన బోరు పనులను ఆయన ప్రారంభించారు. అలాగే తాడిగడప జంక్షన్‌లో అడ్డుగా ఉన్న బడ్డీ కొట్లను తొలగించాలని ఆదేశించారు. కానూరు మురళీనగర్‌లో డ్రెయినేజీ సమస్య ఉండటంతో పారిశుద్ధ్య కార్మికులతో పూడికతీత పనులు చేయించారు. పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు.

కంకిపాడు సీఐగా మురళీకృష్ణ



కంకిపాడు: కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జె.మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో ఇక్కడ పనిచేసిన సీఐ వి.శ్రీనివాసరావును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేశారు. ఈస్థానంలో రేంజ్ నుంచి కంకిపాడుకు జె.మురళీకృష్ణను నియమించారు. దీంతో ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా బాధ్యతలు చేపట్టారు. సీఐ వి.శ్రీనివాసరావు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

వీఆర్ సిద్ధార్థ వీసీగా వెంకటేశ్వరరావు



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ తొలి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ సిద్ధార్థ విద్యా సంవత్సరంలో డీమ్డ్ టుబీ యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. వెంకటేశ్వరరావు గతంలో ఐఐటీ ఢిల్లీలో మెకానికల్, ప్లానింగ్ విభాగానికి హెడ్‌గా పని చేశారు. యూఎస్ఏ ఓక్లహోమా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సలహాదారుడిగా కూడా పని చేశారు. నూతన వీసీని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ ఎం.రాజయ్య అభినందించారు. కార్యక్రమంలో అఫిషియేటింగ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎస్ఆర్‌కె మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని స్వార్థానికి వాడుకుంటున్నారు



గన్నవరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలోని కొంత మంది నేతలు ఉద్యమాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ రూ.లక్షలు దండుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పేటేటి కిషోర్ మాదిగ ఆరోపించారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మందా వేణు, రాష్ట్ర నాయకులు మందా వెంకటేశ్వరరావు, ఎలీషా, కోట దానియేలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 2023లో చేపట్టిన పాదయాత్ర పేరుతో లక్షలాది రూపాయలు విరాళాల పేరుతో వసూలు చేసి స్వాహా చేశారని ఆరోపించారు. త్వరలో కృష్ణ మాదిగను కలిసి వాస్తవాలను తెలియజేస్తానన్నారు. సంఘ నేతలు పులపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులను గురువారం చేపట్టారు. రూ.10 లక్షల అంచనాతో ప్రధాన రహదారి, కాటూరు రోడ్డు, శివాలయం రోడ్డు, పాత ఎస్‌బీఐ రోడ్లలో డ్రెయిన్లలో పూడుకుపోయిన వ్యర్థాలు, మట్టి తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్లలో చేపట్టిన పూడిక తొలగింపు పనులను చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ ఆదేశాలతో పట్టణంలో పూడికతీత పనులను చేపట్టామన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య సాధనే లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నామన్నారు. పూడికతీతతో పాటు దోమలు బెడద తగ్గించేందుకు ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

- ఏటిపాయలో కృష్ణమ్మ పరవళ్లు
- కరకట్ట దిగువ భూముల్లోకి ప్రవేశిస్తున్న వరద నీరు



కాసరనేనివారిపాలెంలో ఏటి ఒడ్డున శివాలయం చుట్టూ చేరిన వరద నీరు

కంకిపాడు: ఏటిపాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ కడలి వైపు పరుగులు పెడుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలు, జలాశయాల నుంచి నీటి విడుదలతో గురువారం ప్రకాశం బ్యారేజీ నుంచి 2.88 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం వెంబడి ప్రవహించే కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. కరకట్ట నుంచి ఏటిపాయలోకి వెళ్లే రహదారి మార్గంలోకి వరదనీరు చొచ్చుకు వస్తోంది. నిన్నటి వరకూ ఏటి పాయ అంచులు తాకుతూ ప్రవహించిన వరద నీరు తాజాగా ఏటిపాయకి వెళ్లే రోడ్డు మార్గంలోకి 10 అడుగుల మేరకు చేరింది. ఏటి ఒడ్డు వరకూ వెళ్లే పరిస్థితి కూడా ప్రస్తుతం లేదు. ఎగువ నుంచి కొట్టుకువచ్చే గుర్రపుడెక్క, తూడు, వ్యర్థాలతో ఏటిపాయ నిండిపోతుంది. ఏటిపాయ మార్గంలోకి కొట్టుకురావటంతో తీవ్రదుర్గంధం వెదజల్లుతోంది. కాసరనేనివారిపాలెం వద్ద ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరద నీరు చుట్టేసింది. ప్రస్తుతం ఆలయంలోకి వెళ్లే మార్గం కూడా మూసుకుపోయింది.

ఏటి ఒడ్డుకు చేర్చుతున్న పడవలు

ఏటిపాయ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మత్స్యకారులు తమ పడవలను భద్రం చేసుకుంటున్నారు. రెవెన్యూ శాఖ ఆదేశాలతో మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు ఏటిపాయలో ఉన్న పడవలను ఇప్పటికే ఒడ్డుకు చేర్చారు. వరద ఉధృతికి పడవలు కొట్టుకుపోకుండా లంగరు వేసి కట్టుదిట్టంగా భద్రపర్చుకుంటున్నారు.

పొంచి ఉన్న ముంపు భయం..

వరద నీటి విడుదల మరింత పెరిగితే ఏటిపాయ వెంబడి ఉన్న పొలాలకు ముంపు తప్పదని రైతులు అంటున్నారు. కరకట్ట దిగువ నుంచి ఏటిపాయ అంచు వరకూ మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి మెట్ట పైర్లు సాగులో ఉన్నాయి. ప్రధానంగా అరటి, తమలపాకు, పసుపు, కూరగాయలు, పశువుల మేత, కంద, కొద్ది విస్తీర్ణంలో వరి సాగు ఉంది. వరద నీరు 5 లక్షల క్యూసెక్కులు దాటితే కరకట్ట దిగువన ఉన్న పొలాల్లో నీరు చేరుతుందని, తద్వారా పంటలపై నష్ట ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

బందోబస్తు కొనసాగింపు..

ఏటిపాయ ఉధృతి రీత్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ఏటిపాయలోకి ఎవరూ వెళ్లకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. బందోబస్తు చర్యలను తహసీల్దార్ వి.భావన్నారాయణ, సర్పంచ్ చిప్పల రామదాసు పర్యవేక్షిస్తున్నారు.

భారీగా వరద నీరు

పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. కొంతకాలంగా ఎడారిని తలపించిన కృష్ణానది ఒక్కసారిగా వరద నీటితో ఉప్పొంగుతోంది. మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలో కృష్ణానది ఉంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నదికి పెద్ద ఎత్తున వరద నీరు వస్తుంది. దాదాపు 2.88 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల కావటంతో దిగువ ప్రాంతాలకు నదిలో వరద నీరు ప్రవహిస్తుంది. యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లోని ఘాట్‌ల వద్దకు వరద నీరు చేరుకుంది. లంక ప్రాంతాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఎవరూ నదిలోకి వెళ్లరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చోడవరం, యనమలకుదురు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరగడంతో నదిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

యథేచ్ఛగా ఇరిగేషన్ స్థలాల ఆక్రమణ



వైకుంఠపురంలో బందరు కాలువ గట్టు తవ్వి ఆక్రమించిన ఇరిగేషన్ స్థలం

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో ప్రభుత్వానికి చెందిన ఇరిగేషన్ స్థలం ఆక్రమణ పరంపర కొనసాగుతోంది. ఏకంగా రైతులకు సాగునీరు అందించే బందరు కాలువ కట్టను తొలిచి వేసి ఇరిగేషన్ స్థలాన్ని టీడీపీ నేత అండదండలతో ఆక్రమించినా అధికారులు ఎవరూ స్పందించటంలేదు. స్థానికులు ఆక్రమణలపై అభ్యంతరం చెబుతున్నా టీడీపీ నేతల అండదండలతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. గోసాల వైకుంఠపురంలో సాగునీరు అందించే బందరు కాలువ కట్ట ఇరిగేషన్ స్థలం ఉంది. అత్యంత విలువైన ప్రభుత్వ భూమిపై టీడీపీ నేతలు కన్ను వేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామానికి చెందిన టీడీపీ నేత అండదండలతో ఆక్రమణలకు దిగారు. ఈ విషయమై గతంలో సాక్షి దినపత్రికలో కథనం రావటంతో రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చి ఘటనా స్థలం వద్దకు వెళ్లి ఆక్రమణలు ఆపారు. ఇరిగేషన్ స్థలం ఆక్రమించితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఆక్రమించిన స్థలాల్లో ఉన్న మెటీరియల్ తొలగించలేదు.

మళ్లీ ఆక్రమణలు

కాగా టీడీపీ నేతలు మళ్లీ ప్రభుత్వ ఇరిగేషన్ స్థలం ఆక్రమణలకు తెగబడ్డారు. ఈ సారి ఏకంగా బందరు కాలువ కట్టనే తొలిచి వేశారు. ఇళ్ల నిర్మాణాలకు మెటీరియల్ సిద్ధం చేసుకున్నారు. కాలువ కట్టను తొలిచి వేయటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బందరు కాలువ కట్ట నీటి ప్రవాహంతో తెగిపోతే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని వాపోతున్నారు. ఇక్కడ ఇంత తంతు జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల్లో ఏమాత్రం స్పందన కనబడటం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలు నివారించి సాగునీరు అందించే బందరు కాలువను కాపాడాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శుల సమన్వయంతో అభివృద్ధి

ఉంగుటూరు: సర్పంచులు, కార్యదర్శుల సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఘన వ్యర్థాల నిర్వహణ జిల్లా డైరెక్టర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరప్రసాద్ పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకుని, గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు. స్వచ్ఛమైన తాగు నీరు, పారిశుద్ధ్యం చర్యలు చేపట్టడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. శిక్షణా తరగతులకు సర్పంచుల బంధువులు హాజరు కావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, ఈఓపీఆర్డీ అమీర్ బాషా, సూపరింటెండెంట్ ఎస్.బసవయ్య, సర్పంచులు, గ్రేడ్-1, గ్రేడ్-5 కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

ఉయ్యూరు: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై పార్టీ పటిష్టతకు పాటుపడాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు అన్నారు. కలవపాములలోని జెడ్పీ పాఠశాలలో బీజేపీ ఉయ్యూరు పట్టణ, రూరల్ శాఖల ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం స్థానిక కల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పి.శివనాగమల్లికార్జునరావు, జ్యోత్స్న ఆధ్వర్యంలో 40 మంది బీజేపీలో చేరారు. రాజాబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీలాకుమారి, ప్రధాన కార్యదర్శి శేషుకుమార్, నాయకులు చిన్మయ, సతీష్, రోహిణికుమార్, విజయేంద్ర, రామారావు ఉన్నారు.

ప్రశాంతంగా స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలు



గన్నవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఎన్నికైన కమిటీ



గొడవర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో చైర్మన్‌గా ఎన్నికైన వక్కలగడ్డ రాముతో ప్రతినిధులు



నున్నలో కమిటీని అభినందిస్తున్న నాయకులు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా చొరగుడి ఎస్తేరు సుచరిత, వైస్ చైర్మన్‌గా తిరివీధి రత్నబాబు ఎన్నికయ్యారు. అదే విధంగా 24 మంది సభ్యులు ఎన్నికకాగా, మరో ఎనిమిది మంది నామినేటెడ్ సభ్యులను నియమించాల్సి ఉందని హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. దావాజిగూడెం, కేసరపల్లి, అల్లాపురం పాఠశాలల కమిటీలు ఎన్నికయ్యాయి.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియను ఆ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో సజావుగా నిర్వహించారు. తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఎంఈఓ-1, 2 శ్రీరామ్ బాలాసింగ్, బి.సురేష్‌కుమార్, హనుమాన్‌జంక్షన్, వీరవల్లి ఎస్ఐలు ఏడీఎల్ జనార్దన్, ఎం.చిరంజీవి పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరగ్గా, జిల్లా పరిశీలకుడిగా రాంబాబు వ్యవహరించారు. ఎన్నికల అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారాన్ని ఆయా పాఠశాలల హెచ్ఎంలు నిర్వహించారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా వై.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా పి.నాగ దుర్గ ఎన్నికయ్యారు. వేలేరు జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా బుర్రే రజని, వైస్ చైర్మన్ మళావతుల లక్ష్మి, కానుమోలు జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా తల్లి బోయిన రామారావు, వైస్ చైర్మన్‌గా చిన్నం అరుణ, వీరవల్లి జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా చంద్ర నాని, వైస్ చైర్మన్‌గా చందు వరలక్ష్మి, రేమల్లే జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా సొదిమెళ్ల శ్యామ్, వైస్ చైర్మన్‌గా పరికెల శైలజా ఎన్నికయ్యారు.

రామవరప్పాడు: రామవరప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు హెచ్ఎం తాయారు సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా బొల్లు రామారావు, వైస్ చైర్మన్‌గా ఈర్ల దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా మరో 15 మందిని ఎంపిక చేశారు.

ఉంగుటూరు: మండలంలోని 32 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించామని ఎంఈఓ - 2 జె.సాంబశివరావు తెలిపారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి ఎన్నికలో ఇద్దరికి సమానంగా రావడంతో లాటరీ ద్వారా పులి శ్రీనివాసరావును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

కంకిపాడు: మండలంలోని 46 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 46 పాఠశాలల్లో 650 మంది ప్రతినిధులు ఎన్నికయ్యారు. 46 మంది చైర్మన్లు, 46 మంది వైస్ చైర్మన్‌లతో కూడిన పాలకవర్గాలు కొలువుదీరాయి. ఆయా పాఠశాలల హెచ్ఎంలు కమిటీ ప్రతినిధులతో ప్రమాణస్వీకారం చేయించారు. మండలంలోని గొడవర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. కమిటీ ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. కమిటీ చైర్మన్‌గా వక్కలగడ్డ రాము, వైస్ చైర్మన్‌గా కుంపటి ఉషారాణితో కూడిన 22 పాలకవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికలను ఎంఈఓ కె.ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలో అన్ని ఎంపీపీ, జెడ్పీ, ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి కమిటీ ఎన్నికలు జరిపించారు. డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓ-2 సుధారాణి పర్యవేక్షించారు.

పెనమలూరు: మండల పరిధిలోని 36 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈఓ శేషగిరారావు వివరాలు తెలుపుతూ.. మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు ఎంపీయూపీ పాఠశాలలు, 26 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ పాఠశాలల్లో మొత్తం 5,278 మంది ఓటర్లు ఉన్నారని, అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగానే జరిగాయన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు హాజరై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకున్నారన్నారు. తాడిగడప పాఠశాలకు పి.శ్రీలత, వణుకూరుకు ఆకునూరు నాగబాబు, పెనమలూరుకు షేక్.కైరూబి, పోరంకి బి.స్వప్నమాధురి, కానూరు వి.కరుణ, యనమలకుదురు కె.దేవి చైర్మన్లుగా ఎంపికయ్యారన్నారు. మిగితా పాఠశాలలకూ చైర్మన్లను ఎంపిక చేశామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ మద్దతుతో కైవసం

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు పలికిన కమిటీ గెలుపొందింది. హైస్కూల్‌లో మొత్తం 15 మంది కమిటీ సభ్యుల్లో 10 మంది సభ్యులు వైఎస్సార్ సీపీ మద్దతునిచ్చిన చైర్మన్‌గా గడ్డం కుమార్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌గా కడవకొల్లు వనితను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఎంఈఓలు ఎ.వెంకటరత్నం, ఎ.సూరిబాబు హాజరుకాగా, హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్యానెల్ గెలుపునకు ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య, దాసరి కిరణ్, బొంతు సాంబిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు కృషి చేశారు. పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను అభినందించారు. నున్న మెయిన్ ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్ పి.జయశ్రీ, వైస్ చైర్మన్ డి.రామ్, హృదయనగర్ చైర్మన్‌గా ఎం.శివరాణి, వైస్ చైర్మన్‌గా టి.దుర్గ ఎన్నికయ్యారు. పాతపాడు చైర్మన్‌గా నల్లమోతు రాణి, వైస్ చైర్మన్ తమ్మిశెట్టి జయదుర్గ ఎన్నికయ్యారు. ఎంపీయూపీ పి.నైనవరం చైర్మన్‌గా కె.రమాదేవి, వైస్ చైర్మన్‌గా ఎండీ ఖాన్ ఎన్నికయ్యారు. స్కూల్ కమిటీల కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని ఎంఈఓలు ఎ.వెంకటరత్నం,ఎ.సూరిబాబు తెలియజేశారు.

సమాజ సేవలో లయన్స్ క్లబ్ ముందుంటుంది



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న లయన్స్ ప్రతినిధులు

కంకిపాడు: సమాజ సేవలో లయన్స్ క్లబ్ ముందుండి పని చేస్తోందని లయన్స్ క్లబ్ 316 డి జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో మాక్సివిజన్ ఐ హాస్పిటల్ సహకారంతో కంకిపాడులోని ఎస్ఎస్ ప్రజ్ఞ పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్ ప్రతినిధి బొట్లా వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సీహెచ్ గౌతమి వితరణతో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరంలో 400 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మంది చిన్నారులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. శిబిరాన్ని గవర్నర్ గద్దె శేషగిరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవకు అంకితం కావాలని, బాధ్యతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, జోన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, జిల్లా అదనపు కార్యదర్శి మద్దుల గోవిందరావు, జిల్లా కేబినెట్ సభ్యుడు బండి నాంచారయ్య, క్లబ్ అధ్యక్షుడు వి.శివరామకృష్ణ, కార్యదర్శి ఎం.యుగంధర్, ట్రెజరర్ ఎస్.నీహార్, ప్రతినిధులు రవితేజ, అరుష్ సుభాష్, బేతపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వీసీ వెంకటేశ్వరరావు తదితరులు



రక్తదానం చేస్తున్న గోద్రెజ్ ఉద్యోగులు

పెనమలూరు: అన్ని దానాల్లో కన్నా రక్తదానం చాలా గొప్పదని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. సెంట్రల్ జీఎస్టీ, రెడ్ క్రాస్ సంయుక్తంగా యూనివర్సిటీలో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని వీసీ ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని వీసీ అభినందించారు. రక్తదానం ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడగలుగుతామని తెలిపారు. ఈ సందర్భంగా 89 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీన్ బావినేని పాండురంగారావు, అధ్యాపకులు, ఎస్ఏసీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

గోద్రెజ్ ఉద్యోగుల రక్తదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని గోద్రెజ్ ఆగ్రోవెట్, నూజివీడు రోడ్డులోని గోద్రెజ్ జెర్సీ క్రీమ్‌లైన్ సంస్థల్లో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 60 మంది గోద్రెజ్ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి భవిరి శంకర్‌నాథ్ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, కృత్రిమంగా రక్తాన్ని ఉత్పత్తి చేయలేమని చెప్పారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్లు హనుమంతయ్య, ధృవకుమార్ గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులు సుధాకర్, కృష్ణమోహన్, గోద్రెజ్ జెర్సీ హెచ్ఆర్ పోసి బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు పొందే హక్కు రాజ్యాంగం కల్పించింది



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జడ్జి పి.రాజారామ్

నున్న(విజయవాడరూరల్): స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు ఉచిత వైద్యసేవలు పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. నున్న గ్రామ శివారు బోడపాడులో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన సంస్థ ఆదేశాల మేరకు గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి పి.రాజారామ్ మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రభుత్వం నుంచి గ్రాంటు పొందే ప్రైవేటు వైద్యశాలల్లో కూడా ఉచిత వైద్య సేవలను పొందవచ్చునన్నారు. వైద్య సేవలు అందకపోతే మండల న్యాయసేవాధికార సంస్థలో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. శిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు విజయ, నిరంజన్, సుష్మ, పలువురు స్పెషలిస్టులు, న్యాయసేవల అధికారి పి.రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుతో బీవోబీ జంక్షన్ శాఖకు ఫస్ట్ ర్యాంక్



బీఎం లలితాంబను సత్కరిస్తున్న ఖాతాదారులు, బ్యాంకు ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఓవరాల్ పెర్ఫార్మెన్స్‌తో బ్యాంకు ఆఫ్ ఇండియా హనుమాన్‌జంక్షన్ శాఖ ఎఫ్‌జీఎంవో హైదరాబాద్ పరిధిలో ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఎఫ్‌జీఎంవో హైదరాబాద్ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్ శ్రీవత్సవ నుంచి బ్రాంచ్ మేనేజర్ బి.లలితాంబ ప్రశంసా పత్రం గురువారం అందింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.140 కోట్ల వ్యాపారం చేయటంతో పాటుగా అన్ని అంశాల్లోనూ హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ ఉత్తమ పనితీరు కనపర్చటంతోనే ఏపీ, తెలంగాణ, బెంగుళూరు జోన్ల పరిధిలో కేటగిరి-బి విభాగంలో ఫస్ట్ ర్యాంకు దక్కినట్లు లలితాంబ పేర్కొన్నారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

పోలీసుల అదుపులో చిట్టీల వ్యాపారి పుల్లయ్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిట్టీల వ్యాపారం పేరుతో రూ.కోట్లలో నగదు వసూలు చేసి నాలుగు నెలల క్రితం పరారైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్యను హనుమాన్‌జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక విజయవాడరోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ కంపెనీ ఏర్పాటు చేసి తోటి టీచర్లు, ఉద్యోగుల నుంచి రూ.కోట్లలో చిట్టీలు, డిపాజిట్లు కట్టించుకుని ఉడాయించాడు. దీంతో ఖాతాదారులంతా లబోదిబోమంటూ తురకా పుల్లయ్య బాధితుల సంఘంగా ఏర్పడి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ సమీపంలో తలదాచుకున్నట్టుగా పక్కా సమాచారం అందటంతో ఎస్ఐ జనార్దన్ అక్కడికి చేరుకుని ఆరా తీయటంతో ఎట్టకేలకు పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజు పోలీసులకు చిక్కారు. దీంతో గురువారం వీరిద్దరిని హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టారు.

11న స్వర్ణభారత్‌లో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 11వ తేదీన గుడివాడ ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, ఉదరం, ఎముకలు, ప్రసూతి, సాధారణ వ్యాధులు, క్యాన్సర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా భోజనం కల్పిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారన్నారు. కేంద్ర సహాయక మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ గౌరవ అతిథిగా పాల్గొంటారని చెప్పారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

23న గాజుల అలంకరణ

రామవరప్పాడు: శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 23వ తేదీన అమ్మవార్లు గాజుల అలంకరణలో భక్తులకు దర్శమిస్తారని తెలిపారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ముగ్గురమ్మలకు గాజుల అలంకరణ చేస్తున్నామన్నారు. గాజుల అలంకరణకు భక్తులు ఈ నెల 22లోగా ఆలయ కార్యాలయంలో గాజులు అందజేయాలని కోరారు.